
సాక్షి ఒడిశా

శనివారం । 11 । జనవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,47,071
బంగారం : 1 గ్రాము 480 మిల్లీ గ్రాములు
వెండి : 107 గ్రాముల 380 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



వైకుంఠ ఏకాదశి..
వైకుంఠ ఏకాదశిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు కిక్కిరిసిపోయాయి. - IIలో▸



కిసాన్ మోర్చా ధర్నా
రైతుల కోసం రోడ్డెక్కారు. పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. - IIలో▸

శ్రీనివాసా.. గోవిందా



శ్రీ వెంకటేశ్వర శతకం పారాయణ కర్త డాక్టర్ సోమయాజుల త్యాగరాజ శాస్త్రికి ఆలయ సభ్యుల సత్కారం



ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



టీటీడీ వాద్య బృందం నాదస్వరం



ఆలయ ప్రాంగణంలో ఉచిత ప్రసాదం పంపిణీ



ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్య సంకీర్తనాలాపనలో భక్త బృందం



మహిళా భక్తుల కోలాటం

భువనేశ్వర్: పవిత్ర వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనానికి సౌకర్యం కల్పించారు. ఈ సదుపాయం ఈ నెల 11వ తేదీ శనివారం కూడా అందుబాటులో ఉంటుందని ఆలయ అధికార వర్గాలు తెలిపాయి. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిరవధికంగా ఈ కార్యక్రమాలు కొనసాగాయి. వెంకటేశ్వర శతక పారాయణం, శ్రీ విష్ణు సహస్ర నామాలు, లలిత సహస్ర పారాయణం, అన్నమయ్య సంకీర్తనాలాపన, ఒడియా, హిందీ భజన సంగీతం, చిన్నారులతో ఒడిస్సీ, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, మహిళల కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నుంచి విచ్చేసిన డాక్టరు త్యాగరాజ శాస్త్రి విశ్వమేలువాడ వేంకటేశ మకుటం శీర్షికతో ఆలాపించిన శ్రీ వెంకటేశ్వర శతకం మంత్రముగ్ధుల్ని చేసింది. ముక్కోటి ఏకాదశి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ధార్మిక కార్యకలాపాల్లో పాలుపంచుకున్న కళాకారులు, సాహితీవేత్తలు ఇతర వర్గాలకు ప్రత్యేకంగా సత్కరించారు. టీటీడీ వాద్య బృందం నాదస్వరంతో దేవస్థానం ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో అలముకుంది. దేవస్థానం ప్రాంగణంలో వేద ఆశీర్వచనం వేదిక, ఆరోగ్య శిబిరం, ఉచిత ప్రసాద పంపిణీ కేంద్రాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. శుక్రవారం అర్ధరాత్రి 2గంటల నుంచి ఆలయం ద్వారాలు తెరిచారు. ఏకాంత సేవతో ఏకాదశి ఉత్సవాలకు తెర దించారు.



చిన్నారి శాస్త్రీయ నృత్య ప్రదర్శన



సాంస్కృతిక కార్యక్రమానికి హాజరైన భక్త జనం

న్యూస్‌రీల్

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది ఆదివాసీ వృద్ధ మహిళలకు నిత్యావసరాలు శుక్రవారం పంపిణీ చేశారు. బియ్యం, కందిపప్పు, నూనె, బంగాళ దుంపలు, ఉల్లి తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకురాలు ఎం.నళిని తెలియజేశారు. ప్రతినెలా ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు రగ్గులు పంపిణీ



చిన్నారులకు రగ్గులు అందజేస్తున్న న్యాయవాదులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి నూవగూడ గ్రామంలోని అంబేడ్కర్ విద్యాలయంలోని రెండు వందల మంది విద్యార్థులకు జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు, రగ్గులు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్ చరణ్ మాహంతి మాట్లాడుతూ.. శీతాకాలంలో పిల్లలు చలితో ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో వీటిని సమకూర్చామన్నారు. న్యాయవాదులు హేమంత్ కుమార్ రాజ్, జోసెఫ్ జేమ్స్, బిజు సర్కార్, బసంత్ సాగరియా, రుమ్పా దేవ్‌నాథ్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ పట్వారి, పక్కనే ఖెముండో, ప్రధాన్‌లు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 26న జరగనున్న గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ ఫరూల్ పట్వారి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే విధంగా సంబంధిత శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ తదితరులు పాల్గొన్నారు.

కుంద్రలో ఎలుగుబంట్ల అలజడి

- భయం గుప్పెట్లో ప్రజలు



కుంద్ర గ్రామంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి కుంద్ర గ్రామంలోనికి ఎలుగు బంట్లు ప్రవేశించాయి. దీంతో గ్రామస్తులు భయంతో వణికిపోతున్నారు. మూడుకుపైగా ఎలుగు బంట్లు గ్రామ పరిసరాలలో సంచరిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. అడవిలో ఆహారం లభించక ఎలుగుబంట్లు గ్రామాల్లోకి వస్తున్నాయని చెబుతున్నారు. గ్రామస్తులు ఎలుగుల నుంచి తమకు రక్షణ కల్పించాలని అటవీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో రంగంలోకి దిగిన అటవీ సిబ్బంది ఎలుగుబంట్లను గ్రామ ప్రాంతం నుంచి తరలించే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారు. గతంలో ఎలుగుబంట్ల దాడి చేసిన ఘటనను తలచుకొని భయపడుతున్నారు. గత ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన ఎలుగుదాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. అదేనెల 29వ తేదీ వృద్ధుడిపై దాడి చేసి చంపేసింది.

• రక్తదాన శిబిరం



మల్కన్‌గిరి: రక్తదానం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

రాయగడ: స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ ప్రాంగణంలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. బజరంగ దళ్ పట్టణ కన్వీనర్ శశ్యజ్యోతి బెహర, శంకర్ బెహర, బిజయ్ చులేట్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని కన్వీనర్ బెహర తెలియజేశారు. ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను విరివిగా ఈ ఏడాది నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

మల్కన్‌గిరి: స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎఫ్ఎల్‌సీ హాల్‌లో జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆశిష్ ఈశ్వర్ పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల్లోకి రక్తదానం ఎంతో గొప్పదన్నారు. రహదారి ప్రమాదాల్లో గాయపడిన ఎంతోమంది సమయానికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో సుమారు 200 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదానం చేసినవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ భోయి, జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: రక్తదానం చేస్తున్న సభ్యులు

సందడిగా క్రీడోత్సవం



స్కిప్పింగ్ పోటీలలో విద్యార్థినులు



పరుగు పందెంలో బాలికలు



ముక్కాల పోటీలలో విద్యార్థులు

జయపురం: స్థానిక నెహ్రూనగర్ జయపురం సిటీ ఇంగ్లిష మీడియం పాఠశాలలో పదో క్రీడా వార్షికోత్సవం శుక్రవారం సందడిగా జరిగింది. స్థానిక అగ్రసేన్ భవన ప్రాంగణంలోని హనుమాన్ మందిరంలో పూజలు చేసి క్రీడా జ్యోతిని వెలిగించి జయపురం తెలుగు సంస్కృతి సమితి ఉద్యోగులు బిరేన్ పట్నాయక్ క్రీడా వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర పట్నాయక్ నేతృత్వంలో విద్యార్థులు క్రీడా జ్యోతితో డెప్పిగుడ, నెహ్రూనగర్ మహాత్మాగాంధీ రోడ్డులో నినాదాలు చేసుకుంటూ పాఠశాలకు చేరారు. అనంతరం పిల్లలకు పరుగు పందెం, లెమన్ స్పూన్, నీడిల్ అండ్ థ్రెడ్ (సూదిలో దారం ఎక్కించటం), స్కిప్పింగ్, హోపింగ్, త్రీ లెగ్డ్ రేస్ పోటీలు నిర్వహించారు. నర్సరీ నుంచి ఏడో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే 6, 7 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పరుగు పందెంలో సుక్రి, అనిష్ కోశ్ల, విఘ్నేష్ పట్నాయక్ మొదటి మూడు స్థానాల్లో నిలవగా.. 5, 7 తరగతులకు నిర్వహించిన పోటీల్లో సబ్నమ్ ప్రవీణ, డి.హాసవి, కె.యోసితశ్రీలు, 4, 5 తరగతుల బాలురుకు నిర్వహించిన పరుగు పోటీలలో డి.జశ్వంత్, టి.బింధు మాదవ్, శాదీన హియాల్‌లు, విద్యార్థినులకు నిర్వహించిన పోటీలలో ఎ.మోనిక, ప్రత్యూష సింగ్, ఎస్.నిహారిక మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. పోటీల నిర్వహణలో కమిటీ సభ్యులు శశిపట్నాయక్, పి.శ్రీనివాసరాజు, ప్రిన్సిపాల్ సుధాకర పటానాయక్, వైస్ ప్రిన్సిపాల్ సస్మిత సాహు, ఎంఈ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఎం.మాధవి లత పాల్గొన్నారు. విజేతలకు ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్టు ప్రధానోపాధ్యాయుడు ప్రతాప పట్నాయక్ వెల్లడించారు.



విజేతలైన నర్సరీ చిన్నారులు



లెమన్ స్పూన్స్‌లో విజేతలైన చిన్నారులు



పరుగుపందెంలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

దేశ పురోగతికి ప్రవాస భారతీయులే వారధి



ప్రవాస భారతీయ దివస్ ఉత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సాదరంగా స్వాగతించిన రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



ప్రవాస భారతీయ దివస్ వేదికపై రాష్ట్రపతి ప్రసంగం



ప్రాచీన గ్రంథాల ప్రదర్శన పరిశీలనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: ప్రవాస భారతీయులు భరత జాతికి గర్వ కారణమని, ప్రపంచ దేశాల్లో మన దేశానికి అత్యుత్తమంగా ప్రాతినిధ్యం వహిస్తున్నారని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. స్థానిక జనతా మైదాన్‌లో 18వ ప్రవాసీ భారతీయ దినోత్సవం ముగింపు పురస్కరించుకుని శుక్రవారం జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. పవిత్ర భారత భూమిలో సంపాదించిన జ్ఞానం, నైపుణ్యాలతో ప్రపంచ దేశాల్లో ఆదర్శవంతులుగా వెలుగొందడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. స్వదేశంలో జరిగిన ఈ భారీ ఉత్సవానికి విచ్చేసిన కొంత మంది ప్రవాస భారతీయులకు ప్రత్యేక పతకాలతో సత్కరించడం గొప్ప అదృష్టమని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఉత్సవం కేవలం వేడుక మాత్రమే కాదని, ఆలోచనలను మార్పిడి చేసుకునే గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. మాతృ భూమితో ప్రవాస భారతీయుల అవినావభావ సంబంధాల్ని నిరంతరం పదిలపరిచే బృహత్తర సంకల్పంతో భారత ప్రభుత్వం పలు కార్యక్రమాల్ని చేపట్టింది. ఈ కార్యక్రమాల్లో ప్రవాస భారతీయులంతా చురుకైన పాత్రధారులుగా ముందడుగు వేయడంతో మన దేశంతో ఇతర ప్రపంచ దేశాల మధ్య సంబంధాలు బలోపేతం అవుతాయని రాష్ట్రపతి అభిప్రాయం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో మీ సహకారం చాలా అవసరమని ప్రవాస భారతీయుల్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ సందర్భంగా 24 దేశాల నుంచి వచ్చిన 27 మంది ప్రముఖ ప్రవాస భారతీయులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక పతకాలతో సత్కరించారు. అనంతరం ప్రవాస భారతీయ దివస్ ప్రాంగణ సముదాయంలో ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలు ఆమె సందర్శించారు.



చిత్ర ప్రదర్శన సందర్శనలో రాష్ట్రపతి

షోరూంలో అగ్ని ప్రమాదం

రాయగడ: స్థానిక బాలాజీనగర్ సమీపంలోని ఎస్‌కే మార్ట్‌లో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రెడీమేడ్ దుస్తులు, షోరూం ఫర్నీచర్ కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. షోరూం యజమాని కాశీనాథ్ సాహు ఎప్పటిలాగే గురువారం రాత్రి వ్యాపార లావాదేవీలు ముగించుకుని షోరూం మూసివేసి వెళ్లిపోయారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆ ప్రాంతంలో కొంతమంది వాకింగ్ చేస్తున్న సమయంలో షోరూం నుంచి దట్టమైన పొగలు రావడంతో వెంటనే షోరూం యజమానికి, అదేవిధంగా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే అప్పటికే షోరూం మొత్తం దగ్ధమైనట్లు తెలిసింది. సంక్రాంతి పండగ కావడంతో పెద్ద ఎత్తున స్టాక్ ఉంచామని, ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటి నష్టం వాటిల్లిందని యజమాని వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాపక కార్యాలయం అధికారి రమేష్ చంద్ర బెహర అనుమానం వ్యక్తం చేశారు.



అగ్ని ప్రమాదానికి గురైన ఎస్‌కే మార్ట్ షోరూం

గంజాయి మొక్కలు ధ్వంసం

రాయగడ: గంజాయి సాగుపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని పద్మపూర్ సమితి జిగిడిపాదొరొ అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న 45 వేల గంజాయి మొక్కలను శుక్రవారం ధ్వంసం చేశారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి సాగవుతుందన్న సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టారు.



గంజాయి మొక్కలను తగలబెడుతున్న దృశ్యం

క్లుప్తంగా

రెండు చోరీ కేసులు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీసులు రెండు చోరీ కేసులరె శుక్రవారం నమోదు చేశారు. కొంగరాం గ్రామానికి చెందిన నేతింటి మీనా కుమారి ఇంటిలోని బీరువాలో రెండున్నర తులాలు బంగారం గత ఏడాది ఆగస్టు ఒక టిన చోరీ జరిగింది. దోమాం పంచాయతీ కొంచాలకూర్మయ్యపేటకు చెందిన రాయ వలస దిలీప్‌కుమార్ ఇంటిలో అరు తులం బంగారం గత ఏడాది అక్టోబర్ 20న చోరీ జరిగింది. ఈ చోరీలు ఆలస్యంగా గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ చెప్పారు.

32 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

గార: మండలంలోని వేర్వేరు చోట్ల జరుగుతున్న పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం వమరవల్లి పంచాయతీ సుగ్గుదాలినాయుడు పేట వద్ద 10 మందిని అదుపులోకి తీసుకొని రూ.29 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కళింగప ట్నం–మత్స్యలేశంలో తుమ్మచెట్లు వద్ద 22 మంది పేకాట ఆడుతుండగా రూ. 31 వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరందరినీ అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.జనార్ధన్ తెలిపారు.

నిప్పంటుకుని మహిళకు గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని గొట్టిపల్లి పంచా యతీ బరబొంతు గిరిజన గ్రామంలో నిప్పంటుకుని మహిళ గాయాలపాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. లింగుపురం భారతి కట్టెల పొయ్యి వద్ద చలి కాగుతుండగా దుప్ప టికి నిప్పంటుకుంది. కుటుంబ సభ్యులు ఆర్పడానికి ప్రయత్నించినా అప్పటికే వెనుక భాగం కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ సీఈవో, ఏపీసీపీఎస్ఈఏ ఉద్యోగులు

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరించే వరకు పోరాటం ఆపే ప్రసక్తి లేదని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు వడమ శరత్ స్పష్టం చేశారు. శుక్రవారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో ఏపీసీపీఎస్ఈఏ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, ట్రెజరీ డీడీ రవికుమార్, డీటీవో తవిటన్న చేతులమీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఏపీసీపీఎస్ఈఏ పోరాటం ఫలితమే ఈ రోజు సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ గ్రాట్యూటీ అని పేర్కొన్నారు. పాత పె న్షన్ కోసం త్వరలో పోరాట కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంపోలు షణ్ముఖరావు, మహిళా అధ్యక్షురాలు పి.జయమ్మ, బి.శ్యామ్‌కుమార్, డేవిడ్‌రాజు, శ్యాం సుందర్, మోహన్, కిరణ్, శ్రీధర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



జయపురం: ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిచ్చిన విష్ణుభగవానుడు



రాయగడ: పూజలందుకున్న వెంకటేశ్వరుడు



రాయగడ: కళ్యాణ వేంకటేశ్వర మందిరం వద్ద భక్తుల సందడి

భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు



రాయగడ: వ్రత మహత్మ్యాన్ని వివరిస్తున్న భాస్కరాచార్యులు



జయపురం: ఆలయ ఉత్తర ద్వారం వద్ద వేచిఉన్న భక్తులు

రాయగడ: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక బాలాజీ నగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో రమా సత్యనారాయణ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఈ సందర్భంగా విశేష పూజలను నిర్వహించిన ఆచార్యులు వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మందిరం భక్తులతో కిటకిట లాడింది. స్వామి వారి దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని కస్తూరీనగర్‌లో ఉన్న సత్యనారాయణ మందిరంలో ప్రధాన అర్చకులు మావుడూరు కిశోర్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

జయపురం: జయపురంలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని భక్తులు భక్తితో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారుజాము ఐదు గంటల నుంచే అధికసంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. 5.30 గంటలకు ఆలయ ద్వారాలు తెరవగా తమ ఆరాధ్య దైవమైన శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. భక్తులు భువర్లోకం ద్వారం నుంచి సువర్లోకం, మహర్లోకం, జనోలోకం , తపోలోక ద్వారాలు దాటుకుంటూ వేంకటేశ్వర ఆలయ ఉత్తర ద్వారం వద్ద వేచిఉండి దైవదర్శనం చేసుకునేందుకు బారులు తీరారు. స్వామివారికి దీపారాధన చేసి గజస్తంభం వద్ద పూజలు చేశారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చి దీవించారు. ఆలయ కార్యనిర్వాహక కమిటీ తరపున లడ్డూ ప్రసాదం అందజేశారు.



జయపురం: దైవదర్శనానికి బారులు తీరిన భక్తులు



జయపురం: దైవదర్శనం చేసుకొని తీర్థం పుచ్చుకుంటున్న భక్తులు



జయపురం: భక్తులు ఉత్తర ద్వారానికి వెళ్లే భువర్లోక ద్వారం



జయపురం: దీపారాధన చేస్తున్న భక్తులు

లింగ సమానత్వం సాధిద్దాం

- విదేశాంగ మంత్రి ఎస్.జయ శంకర్

భువనేశ్వర్: లింగ సమానత్వం, మహిళల నాయకత్వం అంతర్భాగంగా భారత విదేశాంగ విధానం పటిష్ట పరుస్తున్నట్లు విదేశాంగ మంత్రి ఎస్.జయ శంకర్ తెలిపారు. నగరంలో జరుగుతున్న ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సందర్భంగా ఈ విషయం వెల్లడించారు. వికసిత్ భారత్ సాకారం కోసం విదేశాంగ శాఖ ఈ మేరకు కార్యాచరణతో ముందుకు సాగుతుందని, దీంతో అంతర్జాతీయ సంబంధాలు మరింత బలపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. నారీ శక్తి ఇతివృత్తంగా ఈ వేదికపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రగతికి ఆటంకంగా ఉన్న వ్యవస్థాగత సవాళ్లను ప్రస్తావిస్తూ ప్రపంచవ్యాప్తంగా మహిళా నాయకుల విజయాలను ఈ శీర్షికలో ప్రముఖుల అభిప్రాయాలతో లోతుగా చర్చించారు. జీ20 ప్రెసిడెన్సీ సమయంలో మహిళల నేతృత్వంలోని అభివృద్ధి యోచనకు భారత ప్రభుత్వం తొలి బీజం నాటిందని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళల అభివృద్ధిపై ప్రభావం చూపే సమాజంలో లోతుగా పాతుకుపోయిన సమస్యలపై భారత ప్రభుత్వం బలమైన చర్యలతో ముందడుగు వేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సరళమైన సవాళ్లను పరిష్కరించడం కంటే సామాజిక మార్పు ఉన్నత ఫలితాలు ప్రసాదిస్తుందని ప్రోత్సహించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి కుటుంబ స్థాయిలో ఆవిర్భవించే లింగ వివక్ష నివారణతో ఆడ బిడ్డకు పోషకాహారం, ఆరోగ్యం, విద్య వంటి వనరుల కల్పనలో అసమానత తొలగించడంతో లింగ సమానత్వం సాధ్యమవుతుందన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమం భారత దేశ విశాల దృక్పథానికి ప్రతీకగా మంత్రి పేర్కొన్నారు. జీడీపీ వృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ విస్తరణ వంటి సంప్రదాయిక కొలమానాలతో పరిమితమైతే వికసిత్ భారత్ సాధ్యం కాదని, సామాజిక సమతుల్యం కీలక ప్రామాణికంగా కేంద్ర ప్రభుత్వం పరిగణిస్తుందని తెలిపారు.



విదేశాంగ మంత్రి అధ్యక్షతన ప్రవాసీ భారతీయ దివస్ వేదికపై మహిళా నాయకత్వ సదస్సు



సదస్సులో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

సంక్రాంతి సంబరాలకు సన్నాహాలు ప్రారంభం

జయపురం: జయపురంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిపేందుకు అఖిల ఈవెంట్స్ రాంబాబు సన్నాహాలు ప్రారంభించారు. జయపురం ఆర్‌పీ కన్సల్టెన్సీ రమేష్ దాస్ సహకారంతో సంక్రాంతి సంబరాలు జరుపుతున్నట్లు రాంబాబు శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. నేడు ఆయన ఉత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 16వ తేదీన పాత ప్రతాప్ టాకీసు మైదానంలో (హొటల్ మధుమతి పక్కన) సంక్రాంతి ఉత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో సినీ నటుడు గౌతమ రాజు, హైదరాబాద్ గాయకురాలు నందిత జ్యోతి, గాయకుడు షేక్ అబ్బాస్(హైదరాబాద్) పాడుతా తీయగా గాయకుడు వీరా స్వామి, విశాఖపట్నం రోయల్ డాన్స్ కంపెనీ కళాకారుల డాన్స్‌లు, మిస్ ఒడిశా ఫొటోజెనిక్ విన్నర్ హీనా రాణి పట్నాయిక్ కొరాపుట్, కళాకారుడు గంధ్రేటి అఖిల్ పాల్గొంటారని వెల్లడించారు. యాంకర్లుగా నివేదిత మిశ్ర మల్కన్‌గిరి, జ్యోతి విశాఖపట్నం వస్తారని తెలిపారు.

పుషిపుణి మహోత్సవాలకు ఆదివాసీ భాషలో పాట ఎంపిక



సమావేశంలో ధిరెన్ పట్నాయిక్ తదితరులు

జయపురం: కొరాపుటియ కళాకార మంచ్ జయపురం నిర్వహించనున్న పుష్పుణి మహోత్సవంలో ప్రజలకు అంకితం చేసేందుకు శుక్రవారం ఒక దేశీయ భాషలో పాటను ఎంపిక చేశారు. స్థానిక ఒక హొటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంచ్ కార్యదర్శి ప్రముఖ కళాకారుడు ధీరెన్ మోహన్ పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన పుష్పుణి మహోత్సవ కమిటీ సమావేశంలో గణేష్ చంద్ర బిశాయి రచించిన పాటకు హేమంత మిశ్ర, స్వర కల్పన చేయగా రామ హంతాల్, సుమన్ చంథ్, ప్రజ్ఞా పండ,అశ్మిత షాడంగిలు ఆలపించారు. ఈ పాటను పుష్పుణి మహోత్సవంలో గీతాలాపన చేస్తారు. ఈ సందర్భంగా కార్యదర్శ ధిరెన్ మోహణ పట్నాయిక్ మాట్లాడుతూ పుషిపుణి మహోత్సవాలను రెండు ప్రధాన లక్ష్యాలతో నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వైభవంగా ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా



సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ జరుపుతున్న రైతు సంఘం నాయకులు



కలెక్టరేట్ వద్ద ధర్నా జరుపుతున్న ఒడిషా కృషక్ మోర్చా నాయకులు



కలెక్టరేట్ వద్ద ధర్నా జరుపుతున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

పర్లాకిమిడి: అకాల వర్షాలకు పాడైన ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ధర్నా జరిగింది. సంపూర్ణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం కింద రూ.20 వేలు అందించాలని, మండీలలో వెంటనే రంగుమారిన ధాన్యంను కొనుగోలు చేయాలని, రైతులకిచ్చిన రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ నాయకులు కేదార్ శబర, సీపీఐ జిల్లా కార్యదర్శి జోన్న సుభాష్ చంద్రరావు, సీపీఎం (లిబరేషన్) నాయకులు శ్రీనివాస బెహరా, గజపతి జిల్లా రైతుకూలీ రైతు సంఘం నాయకులు రోక్కం లోకనాథం, ఒడిషాకృషక్ సభ నాయకులు యం .బంగారీ, మోహిత్ మిశాల్, పైల మురళీలు కలిసి సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాజవీధి నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ జరిపారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఘన ధర్నా జరిపారు. అనంతరం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఐదుగురు ప్రతినిధులు ముఖ్యమంత్రి ఉద్దేశించి రాసిన ఐదు డిమాండ్ల వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

ఉరేసుకుని సెక్యూరిటీ గార్డు మృతి

- మృతుడిది ఒడిశా రాష్ట్రం

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి ఎస్ఈజెడ్‌లోని వినూత్న ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు శుక్రవారం ఉరేసుకుని మృతి చెందాడు. రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన సుదర్శన్ కుమార్ పాటి (20) ఆర్నెళ్ల నుంచి వినూత్న ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గురువారం సాయంత్రం ఆరు గంటలకు వెళ్లగా, శుక్రవారం ఉదయం సుదర్శన్ పనిచేస్తున్న ప్రాంతంలో ఉరేసుకున్నాడు. అక్కడ పనిచేస్తున్న కూలీలు గమనించి స్థానికులకు లాలంకోడూరు వీఆర్వోకు సమాచారమిచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత మృతదేహాన్ని అప్పగిస్తామని, మృతికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సుదర్శన్‌కుమార్ పాటి మృతదేహం

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT : SHADNAGAR, RANGAREDDY DIST. TELANGANA STATE

O.S.No.77 of 2023

Between:-
Vanga Shyamsunder Reddy ..Plaintiff
And
Ramesh Chandra Chaudhury ..Defendant

NOTICE

To,
Ramesh Chandra Chaudhury, S/o Krushna Chandra Chaudhury, Aged about 54 Years, Occ:IT Proficiently, R/o Plot No.6, Metro Cottage, Chintha Manjeswar, Bhuvaneshwar, Orissa, 751006.

Please take notice that the Plaintiff filed the above Suit for specific performance of the suit schedule property against you. And the suit is posted for your appearance on 27-01-2025 at 10.30 am before the Hon'ble Senior Civil Judge at Shadnagar, Ranga Reddy Dist, Telangana State. Therefore you are hereby requested to appear before the above Hon'ble Court either in person or through Advocate and answer the claim of the Plaintiff, failing which the matter will be decided as per material available on recorded and else the case will be heard and decided in your absence.

// BY ORDER OF THE COURT//

Sd/- Kanchi Rajagopal, Advocate, Shadnagar Town, Faruqnagar Mandal, Ranga Reddy Dist, Telangana State- 509216 Mobile :- 9030622555

శ్రీబాలరామునిగా శ్రీనివాసుడు



అయోధ్య బాలరాముడి అవతారంలో శ్రీనివాసుడు



ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు



కోమటివీధి శ్రీవేంకటేశ్వర ఆలయంలో శ్రీనివాసుని తిరువీధి ఉత్సవం



శ్రీప్రసన్న వేంకటేశ్వర దేవాలయంలో పుష్ప యాగంలో ముత్తైదువులు

పర్లాకిమిడి: స్థానిక శ్రీవేంకటేశ్వర మందిరంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా స్వామి వారికి దర్శనం కల్పించారు. వేకువజామున 4.30 లకే పంచామృత సేవనంలో మొదలై భూదేవి, శ్రీదేవి సమేత శ్రీనివాసుడు తిరువీధి ఉత్సవం జరిపారు. అనంతరం గర్భగుడిలో ఉత్తర ద్వార దర్శనం గుండా వెళ్లే వారికి ఆయోధ్య బాల శ్రీరాముడు అవతారంలో భక్తులకు దర్శనం కల్పించారు. కేవుటి వీధిలో శ్రీప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో లక్షపూలతో ముత్తైదువులు పూజలు చేశారు. అనంతరం 108 ముత్తయిదువులచే సామూహిక సత్యన్నారాయణ స్వామి వ్రతాలను ఆలయ పూజారి అనుమంచిపల్లి రాజగోపాలచారి జరిపించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

■ ఇంటర్‌నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు వైజాగ్ / కొత్తవలస అరకు రోడ్డు దగ్గర VMRDA / పంచాయితీ ప్లాట్లు అమ్మకం. బుజ్జి. ఫోన్ : 91004 68596, 99514 94737 [V- 2079]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

వేడుకగా స్వామివారి తిరువీధి



స్వామివారి తిరువీధిలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: మండలంలోని సంగంవలసలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలతో భక్తులు గ్రామంలో తిరువీధిని నిర్వహించారు. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం స్వామివారి తిరువీధిని మంగళ వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని ద్విచక్రవాహనాలతో రోడ్డుపై నడిపేవారంతా హెల్మెట్‌లు కార్లు నడుపుతున్న వారు సీట్‌బెల్ట్‌లు ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. రైల్వే థర్డ్‌లైన్-ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న జంక్షన్‌లో వాహన చోదకులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిపివలస నుంచి లచ్చయ్యపేట వరకూ ఉన్న రాష్ట్రీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని కోరుతూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డునిర్మాణం

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీ మధుర గ్రామమైన అప్పయ్యపేట కాలనీలో మండలపరిషత్ నిధులతో ఎంపీటీసీ బి.కుసుమ ఆధ్వర్యంలో శుక్రవారం సీసీరోడ్డు నిర్మాణం జరిగింది. ఈ మేరకు వైఎస్ఆర్‌సీపీ మండల నాయకులు బి.సూర్యనారాయణ, ఎంపీటీసీ కుసుమ మాట్లాడుతూ మండల ఇంజినీరింగ్ అధికారి గంట చంద్రమౌళి పర్యవేక్షణలో గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామానికి తాగునీరు సౌకర్యం కల్పించామన్నారు. అలాగే జగనన్న కాలనీ, న్యూకాలనీకి రాకపోకలు నిర్వహించే రహదారికి సీసీరోడ్డు నిర్మాణం జరిగిందన్నారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం వేడుకగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. భోగిమంట వేసి దాని చుట్టూ తిరుగుతూ భోగి పాటలు పాడుతూ సందడిగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ



కోర్టు బహిష్కరణ చేసిన న్యాయవాదులు

సాలూరు: పట్టణంలోని న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులు బహిష్కరించారు. గుంటూరు జిల్లా పొన్నూరు టౌన్ పోలీసులు బేతల ప్రకాశరావు అనే న్యాయవాదిపై అమానుషంగా ప్రవర్తించి తప్పుడు కేసు రిజిస్ట్రేషన్ చేసినందుకు, పోలీసుల చర్యలను ఖండిస్తూ విధుల బహిష్కరణ చేసినట్లు బార్ కౌన్సిల్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడ్డి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పాచిపెంట: మండలంలోని రాయి గుడ్డివలస పంచాయతీ ఎగువ కొత్తవలస సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం (50) లభ్యమైనట్లు ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు. మృతుడు ఐదు అడుగుల పొడవు ఉన్నాడని, ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ధరించాడని చెప్పారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



వెంగాపురం రామాలయంలో ఉత్తరద్వార దర్శనంలో పూజలు అందుకుంటున్న స్వామివారు



వేణుగోపాలస్వామి ఆలయంలో తిరువీధి చేస్తున్న స్వామివారు



పెదకోమటి రామాలయంలో స్వామివారి పూలంగి సేవ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, రోజమ్మ దంపతులు



లచ్చయ్యపేటలో స్వామివారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు

సీతానగరం: మండలంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం లచ్చయ్యపేట లక్ష్మీతిరుమల వెంకటేశ్వరస్వామి, స్థానిక వేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు క్యూకట్టి స్వామివారిని దర్శించుకున్నారు. వేణుగోపాలస్వామి ఆలయంలో పి శ్రీనివాసాచార్యులు, లక్ష్మీతిరుమలలో అర్చకులు పవన్‌కుమార్ ఆచార్యులు, వెంకటరమణాచార్యులు స్వామివార్లను మేళతాళాలతో భక్తులతో పల్లకీలో తిరువీధి గావించారు.లక్ష్మీ తిరుమల వెంకటేశ్వరస్వామి వారిని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాకులు ఎస్‌వీసీహెచ్ అప్పలనాయుడు కుటుంబసమేతంగా దర్శించుకుని పూజలు చేశారు.

ఉత్తరద్వార దర్శనం

బలిజిపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారిని ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శన కార్యక్రమం ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా వెంగాపురం రామాలయంలో అర్చకులు గోపాలకృష్ణ, ఫణికుమార్, సూర్యనారాయణల ఆధ్వర్యంలో స్వామివారి దర్శనానికి ఉత్తరద్వారం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భూలోకం, భువర్‌లోకం, సువర్‌లోకం, మహర్లోకం, జనోలోకం, తపోలోకం, సత్యలోకం అనే ఏడులోకాల ద్వారాలు ఏర్పాటు చేసి ఆ తరువాత ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. ముక్కోటి ఏకాదశి ఎంతో పర్వదినమని, ఆ రోజున స్వామివారి ఉత్తరద్వార దర్శనం చేసుకోవడం మహద్భాగ్యమని అర్చకులు తెలిపారు. తెల్లవారుజామునుంచి స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

సాలూరు: పట్టణంలోని వెంకటేశ్వరస్వామి, పెదకోమటి రామాలయం తదితర ప్రాంతాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఉత్తరద్వార దర్శనాలు, ప్రత్యేకంగా విశేష పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెదకోమటి రామాలయంలో స్వామివారి పూలంగి సేవ కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, రోజమ్మ దంపతులు భక్తులతో కలిసి సామాన్యుల్లా లైన్‌లో నిలబడి స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలు కలిగి ఉండాలని రాజన్నదొర ప్రార్థించారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: పట్టణంలోని శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా పూజలు అభిషేకాలను స్వామి వారికి శనివారం నిర్వహించారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లను చేశారు. ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని జగదీశ్వర ఆచార్యులు తెలిపారు. వేకువజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు.

తాగునీరు సరఫరాకు చర్యలు



బూర్జలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ

సీతానగరం: మండలంలో ప్రజారోగ్యం పట్ల పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. మండలంలో పెద్దగ్రామమైన బూర్జలో రక్షిత మంచినీరు సరఫరా చేస్తున్న పైప్‌లైన్,ట్యాప్‌లు లీకులమయం కావడం వల్ల సర్పంచ్ జి.దాసు పర్యవేక్షణలో శుక్రవారం బూర్జలో మంచినీరు పైప్‌లైన్ లీకులను నివారించే పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిర్వహించిన ఇంటింటి కుళాయిల నిర్మాణం పనులు పూర్తి కావడంతో లీకుల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరామన్నారు. అన్నిగ్రామాల్లో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా చెయ్యడానికి సర్పంచ్‌ల పర్య వేక్షణలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

671కేజీల గంజాయి పట్టివేత



విలేకనరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి



నిందితులతో పోలీసులు

సాలూరు రూరల్: పాచిపెంట మండలం మాతుమూరు గ్రామం దగ్గర శుక్రవారం పాచిపెంట పోలీసులకు అందిన సమాచారం మేరకు వేటగానివలస గ్రామం వద్ద బొలెరోలో అక్రమంగా తరలిస్తున్న 671 కేజీల గంజాయిని ఎస్సై వెంకట సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాలూరు రూరల్ సర్కిల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేటగానివలస కూడలి వద్ద ఉదయం 6 గంటల సమయంలో వాహన తనిఖీలు చేస్తుండగా రెండు బొలెరో వాహనాల్లో తరలిస్తున్న 671 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. అరకు నుంచి సాలూరు వైపు వస్తున్న వాహనాల్లో 300 ప్యాకెట్లలో గంజాయితోపాటు 6గురు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ.33 లక్షల యాభైవేలు ఉంటుందని చెప్పారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన లక్ష్మీ కాంత్‌సెస, బత్తోరం కమెండో, తంగుల విశ్వనాథ్, ఖిల్లో వినోద్ బురిడి కృష్ణ, కొర్ర దంబురు అనే నిందితులు పట్టుబడగా రాజు, సోమనాథ్‌లు పరారైనట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ రామకృష్ణ, పాచిపెంట ఎస్సై వెంకట సురేష్‌లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి నరసింహదేవ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి తిరుపతినాయుడు సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పలు ఆరోపణలపై అగస్టులో "సాక్షి" ప్రచురించిన యూనిఫాం పేరుతో డబ్బుల వసూళ్ల కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎన్‌సీసీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. 2024వ సంవత్సరంలో బ్రాంచి హైస్కూల్‌లో 100 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు వచ్చిన యూనిఫాం డబ్బులు వసూలు చేసిన వార్తకు స్పందించి దర్యాప్తు నిర్వహించి పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు (ఎఎస్‌ఓ) నరసింహదేవుడును సస్పెండ్ చేస్తూ డీఈఓ తిరుపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

ఐటీడీఏ డీడీగా కృష్ణవేణి



డీడీకి శుభాకాంక్షలు తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం డీడీగా కృష్ణవేణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన సంఘ నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పల్ల సురేష్ చంద్రశేఖర, దుక్క సీతారాం, త్రినాధ్ వెంకటరమణ, గౌతమ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

గర్భిణులు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలి

సీతానగరం: మండలంలోని గర్భిణులు విధిగా హిమోగ్లోబిన్ శాతం ఏమేరకు ఉన్నదీ తెలుసుకునేందుకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విధిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఉష, డాక్టర్ పి.పావని అన్నారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో రెండురోజులుగా 50 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో ల్యాబ్ ఉన్న కారణంగా ఉచితంగా గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్నామన్నారు.

ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

- జనవరి 21 నుంచి దరఖాస్తులకు ఆహ్వానం
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య



పార్వతీపురంటౌన్: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ద్వారా రాబోయే 5 సంవత్సరాల్లో దేశంలోని టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రారంభమైందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా యువత ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను 12 నెలలు పారిశ్రామిక అనుభవం అందించాలని సంకల్పించిందని తెలిపారు. 20 కంటే ఎక్కువ రంగాలలో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇంటర్న్‌షిప్ చేయాలనుకునే వారికి దేశవ్యాప్తంగా అవకాశాలు ఉంటాయన్నారు.

విద్యార్హతల విషయానికొస్తే..

ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు అర్హత సాధించడానికి, దరఖాస్తుదారులు తమ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఐటీఐ నుంచి సర్టిఫికెట్, పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్ నుంచి డిప్లమో లేదా బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీఫామ్ వంటి డిగ్రీని కలిగి ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ లేదా దూరవిద్య ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. భారత ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద చేరే ప్రతి ఒక్కరికీ బీమా కవరేజీ అందిస్తుందన్నారు.

నమోదు చేసుకోవాలిలా..

అర్హత, అభ్యర్థులు ఈ క్రింది లింక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీఎస్://ప్రిమినిస్ట్రిప్.ఎంసీఏ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ ఇంటర్న్‌షిప్ కోసం ఆధార్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తె లిపారు. ఎంపికైన వారికి 12 నెలలపాటు రూ.5 వేలు స్టైపెండ్ అందిస్తారన్నారు. ఏకకాల గ్రాంటు కింద రూ.6 వేలు కూడా ఇస్తారని, ఇంటర్న్‌షిప్ జనవరి 10వ తేదీన ప్రారంభమైందని. జనవరి 21వ తేదీ ఆఖరు తేదీ అని తెలిపారు. 21-24 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులే ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలు మరిన్ని వివరాల కోసం ఫోన్ 9676965949 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

2300కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

బలిజిపేట: మండలంలోని జనార్దనవలస గ్రామం వద్ద అక్రమంగా తరలుతున్న 2,300కిలోల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ రమేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా వంగర మండలం, లక్ష్మింపేట గ్రామంలో అక్రమంగా కొనుగోలుచేసి వాటిని ఒడిశా రాష్ట్రంలోని అలమండ గ్రామానికి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు పట్టుకున్నారు. ఆ బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకుని, ఓనర్ ఆవు చిన్నంనాయుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్సై రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ గోకులాల మంజూరులో పక్షపాతం తగదు

- మండల సమావేశంలో అధికారులపై సభ్యుల ధ్వజం



పశుసంవర్థక శాఖ అధికారిని మినీ గో కులాలు మంజూరు విషయంలో వివరణ కోరుతున్న ఎంపీపీ



సభకు హాజరైన సభ్యులు, అధికారులు

పాచిపెంట: మినీ గోకులాల మంజూరులో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని సంబంధిత శాఖ అధికారులను మండల ఎంపీటీసీలు సర్పంచులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బి.ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ క్రమంలో పశుసంవర్ధక శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో గ్రామపంచాయతీ తీర్మానాలు లేకుండా మినీ గోకులాలు మంజూరు చేయించి ఎలా నిర్మాణాలు చేపడుతున్నారని ఉపాధి, పశుసంవర్ధక శాఖ అధికారులను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నిలదీశారు. పంచాయతీల వారీగా ఎన్ని మంజూరయ్యాయి? అనే విషయాన్ని తెలియజేయాలని సభ్యులు కోరగా సంబంధిత అధికారుల దగ్గర పూర్తి సమాచారం లేకపోవడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి సమాచారం లేకుండా సభకు ఎలా వస్తారని ఆమె మండిపడ్డారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల విషయంలో కూడా సర్పంచులకు సంబంధం లేకుండా ప్రైవేట్ వ్యక్తులతో ఉపాధి హామీ చట్టానికి విరుద్ధంగా ఎలా పనులు చేయిస్తారని కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు సభ దష్టికి తీసుకువచ్చారు. ఆర్టీసీపై చర్చ జరుగుతున్న సమయంలో ఎంపీటీసీ దండి ఏడుకొండలు మాట్లాడుతూ పండగ సమయంలో కూడా మండల కేంద్రానికి బస్సులు రావడంలేదని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ సభకు తెలియజేశారు. విద్యుత్ శాఖపై చర్చ జరిగే సమయంలో పలువురు గిరిజన సర్పంచులు ఎంపీటీసీలు మాట్లాడుతూ గతంలో వేసిన ఐరన్ పోల్స్ పూర్తిగా పాడైపోయాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు.

హాజరు కాని అధికారులకు మెమోలు

అనంతరం సభను ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి కూడా చట్టాలకు అనుగుణంగా పని చేయాలని అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరించకూడదన్నారు. అలా వ్యవహరించిన అధికారులపై న్యాయపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీచేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవోను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పాత్ర, వైస్ ఎంపీపీ మీసాల నారాయణ, ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా పనులు జరగకపోతే ఎలా?



ఉపాధి హామీ పథకం పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న పీడీ రామచంద్రరావు

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో పీడీ రామచంద్రరావు ఆగ్రహం

మక్కువ: ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్న ఉద్దేశంతో ఉపాధి హామీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు వెచ్చిస్తుంటే, పనులు పూర్తిస్థాయిలో జరిపించకుండా నగదును వెనక్కి పంపించడం మంచి పద్ధతి కాదని పీడీ రామచంద్ర రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 21 పంచాయతీలలో నిర్వహించిన 2141 పనులకు రూ.22 కోట్ల 33 లక్షల 14వేల 386ల ఖర్చులపై ఇటీవల సామాజిక బందం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, గ్రామ సభలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వెల్లడైన వివరాలను సామాజిక తనిఖీ ప్రజావేదికలో వారు వెలడించారు. పని వివరాల బోర్డు ఏర్పాటుకు నగదు ఖర్చు చేసినప్పటికీ, పని ప్రదేశాలలో వివరాల బోర్డులు లేకపోవడం, సంతకాలు, వేలిముద్రలు లేకుండా వేతన దారులకు నగదు చెల్లించడంపై చప్పబుచ్చింపేట ఉపాధి హామీ సిబ్బందిపై పీడీ రామచంద్రరావు మండిపడ్డారు.

పని ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలి

20 రోజుల్లోగా పని ప్రదేశాల వద్ద పని వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలని కన్నంపేట ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. చాలా వరకు పంచాయతీలలో మస్టర్లలో దిద్దుబాట్లు, వేలిముద్రలు లేకుండా పేమెంట్ చేయడం, వివరాల బోర్డులు పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయకపోవడం, ఎంబుక్‌లో అదనంగా పేమెంట్ చేయడం వంటివి ప్రధానంగా గుర్తించారు. కొంతమంది సిబ్బంది నుంచి రికవరీ చేయాలని పీడీ రామచంద్రరావు ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి. శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీహరి, ఎంపీడీవో డి.డి. స్వరూపారాణి, డీపీవో. వెంకటరమణ, ఎస్ఆర్పీ దాసు, ఏపీఓ ఈశ్వరమ్మ, ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ కమిటీలో వివిధ హోదాలలో నియామకాలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉపాధ్యక్షులు: బలగ శ్రీరాములు నాయుడు (పార్వతీపురం), భనకి లక్ష్మణరావు (పాలకొండ), పాచిపెంట శ్రీనివాసరావు (సాలూరు), కళింగ మల్లేశ్వరరావు (కురుపాం)

కార్యదర్శులు: కర్రి లీలారావు (పాలకొండ), పోల సత్యనారాయణ, తప్పిట ప్రసాదరావు (పార్వతీపురం), మండల శంకర్రావు(కురుపాం), దండి శంకర్రావు (సాలూరు)

ట్రెజరర్ : అడ్డాకుల మన్మథరావు (కురుపాం) సెక్రటరీ ఆర్గనైజేషన్ కర్రి మల్లేశ్వరరావు, సువ్వాడ రామకృష్ణ (సాలూరు), ఎన్.సన్యాసిరావు భుక్త, తోట సిహాచలం (పాలకొండ), రేవు సత్తిబాబు, అల్లు ఈశ్వరరావు (కురుపాం), కురిటి మోహన్‌రావు, బంకురు శంకర్రావు (పార్వతీపురం)

సెక్రటరీ యాక్టివిటీ: సేనాపతి నారాయణ రావు, మోకర లక్ష్మణరావు (సాలూరు),సవర రాము, కోట అజయ్ బాబు (పాలకొండ), నిమ్మక లక్ష్మణరావు, దత్తి శంకర్రావు (కురుపాం), గుణుపూరు గంగయ్య, బుడితి ముకుంద రావు (పార్వతీపురం)

అఫీషియల్ స్పోక్స్‌పర్సన్: మువ్వల సత్యనారాయణ, (పార్వతీపురం), మరడాన సింహాచలం నాయుడు (కురుపాం) నల్లి శివ ప్రసాద్ (పాలకొండ)

ఒప్పందాలకు జీఓలు జారీచేయకుంటే మరో సమ్మెకు సిద్ధం



దీక్షను ప్రారంభిస్తున్న నాయికులు

సాలూరు: రాష్ట్రంలో పురపాలక సంఘాలు, కార్పొరేషన్‌లలో 2023 డిసెంబర్‌లో 17 రోజులు సమ్మె సందర్భంగా ప్రభుత్వం, అధికారులు చేసిన ఒప్పందాలన్నింటికి జీఓలు జారీ చేయకపోవడాన్ని నిరసిస్తున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు తెలిపారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సాలూరు పట్టణంలో యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, శంకర్రావులతో కలిసి శుక్రవారం రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నూతనంగా ఏర్పడిన ఈ కూటమి ప్రభుత్వం పెద్దలకు, మంత్రి, పరిపాలన శాఖ అధికారులకు విన్నవించినా వారు సమస్యల పరిష్కారానికి కృషిచేయలేదన్నారు.అందుకే ఈ దీక్షలు చేపడుతున్నామని, సమస్యలు పరిష్కరించకుంటే మరో సమ్మె, చలో విజయవాడ నిర్వహించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. వెంటనే ఒప్పందాల జీఓలు జారీ చేయడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇందు, వెంకన్న, ప్రసాద్, కేశవ, వాసు, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు నియామకాలు రద్దు చేయాలి

పార్వతీపురంటౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లా వైద్యారోగ్య శాఖలో జరిగిన అడ్డగోలు నియామకాలు రద్దు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖలో తాత్కాలిక పద్ధతిలో మెడికల్ ఆఫీసర్, జిల్లా ప్రోగ్రాం కో- ఆర్డినేటర్, సీనియర్ డీఆర్-టీబీ, టీబీ-హెచ్ఐవీ సూపర్ వైజర్, అకౌంటెంట్ ఐదు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేశారన్నారు. అయితే నియామకాల్లో ఎటువంటి రిజర్వేషన్ పాటించలేదన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఈ నియామకాలు రద్దు చేయాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు, రేపు సంక్రాంతి సంబరాలు

పార్వతీపురం: సంక్రాంతి సంబరాలను ఈ నెల 11, 12 తేదీల్లో పార్వతీపురంలో నిర్వహిస్తామ ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సంక్రాంతి సంబరాల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో ప్రజలందరూ పాల్గొనేలా చూడాలన్నారు. ముగ్గులు, ఆటలు, గాలి పటా లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద ముగ్గు ల పోటీలు ప్రారంభమవుతాయని, 11 గంటలకు గాలిపటాల పోటీలు, మధ్యాహ్నం 4 గంటల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులు, స్థానిక కళాకారులతో జానపద, శాస్త్రీయ నృత్యాలు, వివిధ శాఖల ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. 12వ తేదీ, ఆదివారం వివిధ శాఖల ప్రదర్శనలు, ఛాయా చిత్ర ప్రదర్శన, చిన్నారులు క్రీడలు, ఆహార ప్రదర్శన శాలలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి టి.కనకదుర్గ, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎండీ గయాజుద్దీన్, విద్యాశాఖ ఏడీఎం ఇ.రమాజ్యోతిపాల్గొన్నారు.